ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీకాకుళం

జిల్లా వార్తలు

బుధవారం 8 అక్టోబరు 2025



సిరిమానునుఅధిరోహించిన పూజారి బంటుపల్లి వెంకటరావు



సిరిమానోత్సవంలో భక్తజనం

పైడిమాంబకు ప్రణమిల్లి

- అంబరాన్ని తాకిన సిరిమాను సంబరం
- అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- వర్షంలో తడుస్తూనే నిరీక్షణ

విజయనగరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పైడి తల్లి సిరిమానోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న భక్తులు సిరిమాను ఊరేగింపును కనులారా వీక్షించి పులకించిపోయారు. ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు అమ్మవారి ప్రతిరూపంగా సిరిమానును అధిరోహించి అశేష భక్త జనానికి ఆశీస్సులు అందించారు. వర్షం కారణంగా సాయంత్రం 4.22 గంటలకు సిరిమాను ఊరేగింపు మొదలైంది. 5.45 గంటల వరకూ సాగింది. అంతకుముందు హుకుంపేటలో సిద్ధమైన సిరిమాను, ఇరుసుమాను, ఇతర రథాలను మధ్యాహ్నం 1.30 గంటలకు చదురుగుడికి చేర్చారు. ఆలయ పూజారి వెంకటరావు హుకుంపేట నుంచి కాలినడకన చదురుగుడికి 2.45 గంటలకు చేరుకున్నారు. అనంతరం సంప్రదాయ వస్త్రధారణలో తలపాగా ధరింపచేసి పూజారి వెంకటరావును సిరిమాను అధిరోహణకు సిద్ధం చేశారు. అదే సమయానికి భారీ సంఖ్యలో భక్తులు ఇటు కోట, అటు గంటస్తంభం, అంబటి సత్తర్వు రోడ్డు, గురజాడ అప్పారావు స్వగృహం రోడ్డు వద్దకు చేరుకున్నారు. సిరిమానోత్సవం ప్రారంభానికి ముందు వర్షం పడడంతో ఏర్పాట్లకు స్వల్పంగా ఆటంకం కలిగింది. వర్షం తగ్గాక 4.22 గంటలకు సిరిమాను, రథాలు కదిలాయి. అంజలి రథం, జాలరి వల, పాలధార, తెల్ల ఏనుగు నడవగా సిరిమాను చదురుగుడి నుంచి కోట వద్ద ఉన్న కోట శక్తిని తాకుతూ మూడు పర్యాయాలు తిరిగింది. సిరిమాను తిరిగే రోడ్డంతా భక్తజనంతో రద్దీగా మారిపోయింది

కార్మికులపై పిడుగు



క్వారీలో శ్రావణ్‌కుమార్, హేమరాజ్, పింటు మృతదేహాలు

- గ్రానైట్ క్వారీలో ఘోరం
- ముగ్గురు కార్మికుల మృతి
- మరో నలుగురికి గాయాలు
- మృతులంతా ఇతర రాష్ట్రాల వారే

మెళియాపుట్టి/టెక్కలి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మరో అర గంటలో పనులు ముగించుకుంటారు. ఇంటికి వెళ్లడానికి వారంతా సిద్ధమవుతున్నారు. ఇంతలో ఉరుములు.. మెరుపులతో కూడిన శబ్దాలు వినిపించాయి. బాంబులు పెట్టకుండానే ఆ శబ్దాలేంటీ అనుకున్నారు. ఏం జరిగిందో తెలుసుకునే లోపే అక్కడికక్కడే మూడు మృతదేహాలు పడిఉన్నాయి. మరి కొంతమంది గాయపడి ఉన్నారు. దీంతో కార్మికులంతా భీతిల్లిపోయారు. ఇదీ మెళియాపుట్టి మండలం గంగరాజపురం పంచాయతీ పరిధి రాజ్‌యోగ్ గ్రానైట్ క్వారీలో జరిగిన ఘోరం. మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో పిడుగుపడి బిహార్ రాష్ట్రానికి చెందిన శ్రావణ్‌కుమార్ (45), రాజస్థాన్ రాష్ట్రం జాగూర్ జిల్లా ముఖన గ్రామానికి చెందిన హేమరాజ్ (25), మధ్యప్రదేశ్‌కు చెందిన పింటు (30) అనే ముగ్గురు కార్మికులు అక్కడక్కడే మృతి చెందారు. మరో నలుగురు కార్మికులు టెక్కలి ఆదీఆంధ్రా వీధికి చెందిన కాళ్ల జనార్ధనరావు, మెళియాపుట్టి మండలం బందపల్లి గ్రామానికి చెందిన కరణం బాలరాజు పెద్దలక్ష్మీపురం గ్రామానికి చెందిన బైపోతు హరిప్రసాద్, ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి బ్లాక్ పరిధి టంకసాయి గ్రామానికి చెందిన జాన్ బోనియాసింగ్ గాయపడ్డారు. క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ బి.పాపారావు, పాతపట్నం సీఐ సన్యాసి నాయుడు, ఎస్ఐ మధుసూదనరావు పరిశీలించారు. టెక్కలి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీ, ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, సీఐ విజయ్‌కుమార్ పరామర్శించి ప్రమాద సంఘటనపై ఆరాతీశారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని జేసీ ఆదేశించారు. క్షతగాత్రుల బంధువులు, కుటుంబసభ్యులు ఆస్పత్రికి చేరుకుని తమవారి పరిస్థితిపై ఆందోళనకు గురయ్యారు. అయితే వారికి ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలపడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాతపట్నం సీఐ సన్యాసినాయుడు తెలిపారు.



క్షతగాత్రుడితో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

నిరుపేద కుటుంబాలు..

పిడుగుపడి మృతి చెందిన శ్రావణ్‌కుమార్, హేమరాజ్, పింటులవి నిరుపేద కుటుంబాలు. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి. తమ రాష్ట్రాల్లో పనుల్లేక ఇక్కడకు వచ్చి గ్రానైట్ క్వారీలో రోప్‌కట్టర్లుగా పని చేస్తున్నారు. వీరంతా వేర్వేరు రాష్ట్రాలకు చెందిన వారైనా ఒకచోట కలిసి పని చేస్తుండడంతో స్నేహితులుగా మారారు. మృత్యువులోనూ ఈ బంధం వీడకపోవడంతో తోటి కార్మికులు కంటతడి పెడుతున్నారు. వీరి కుటుంబాలకు సమాచారం అందించినట్లు అధికారులు తెలుపుతున్నారు.

మూడు రోజుల కిందటే విధుల్లోకి..

బిహార్‌కు చెందిన శ్రావణ్‌కుమార్ (మిగతా 6వ పేజీలో..)

మంత్రి అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి

గ్రానైట్ క్వారీ వద్ద పిడుగుపాటుకు గురై ముగ్గురు కార్మికులు మృతిచెందడం, మరో నలుగురు గాయపడడంపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సంఘటన చాలా దురదృష్టకరమని, మృతుల కుటుంబాలకు తన సానుభూతిని తెలిపారు. టెక్కలి ఆసుపత్రి సూపరింటెండెంట్ బొడ్డేపల్లి సూర్యారావుతో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

నిరాశ పరిచిన 'నైరుతి'

- జిల్లాలో ఇంకా లోటు వర్షపాతమే
- 52.1 మిల్లీమీటర్లు తక్కువ
- ఈశాన్య రుతుపవనాలపైనే ఆశలు



శ్రీకాకుళం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదు. అక్టోబరు వచ్చేసినా మోస్తరు వర్షాలు తప్ప భారీ వానలు పడడం లేదు. దీంతో ఇంకా లోటు వర్షపాతమే నెలకొంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నైరుతి రుతుపవనాలు తీవ్రంగా నిరాశ మిగిల్చాయి. జూన్ నుంచి సెప్టెంబరు వరకు నాలుగు మాసాల్లో కేవలం ఆగస్టు మినహా మిగిలిన మూడు మాసాల్లో లోటు వర్షపాతమే నమోదైంది. వాతావరణశాఖ గణాంకాల ప్రకారం జూన్ నుంచి సెప్టెంబరు వరకు 679.17 మిల్లీమీటర్ల వర్షం జిల్లాలో కురవాల్సి ఉంది. కానీ, 627.07 మి.మీ మాత్రమే పడింది. దీంతో 52.1 మి.మీ లోటు వర్షపాతం నెలకొంది. ఆగస్టులో మాత్రం కురవాల్సిన దానికంటే 47.62 మిల్లీమీటర్ల వర్షం అధికంగా కురవడంతో కాస్త ఉపశమనం లభించింది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు నిష్క్రమించి ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించాయి. దీంతో భారీ వర్షాలపై రైతులు ఆశలు పెట్టుకున్నారు.

తొలివారంలో భారీ వర్షాలు..

ఈశాన్య రుతుపవనాలు, మరోపక్క వాయుగుండం కారణంగా అక్టోబరు తొలివారంలో జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. కొన్ని చోట్ల కుండపోతగా వానలు పడ్డాయి. ఫలితంగా 72.79 శాతం వర్షపాతం నమోదైంది. కురవాల్సిన 66.08 మి.మీ కంటే అధికంగా 6.71మి.మీ వర్షం పడింది. ప్రతిఏటా అక్టోబరు (మిగతా 6వ పేజీలో..)

సెప్టెంబరు, అక్టోబరు (తొలివారం)లో నమోదైన వర్షపాతం

మండలం	సెప్టెంబరు	అక్టోబరు
శ్రీకాకుళం	141.02	35.54
ఆమదాలవలస	40	41.08
బూర్జ	80	39.25
ఎచ్చెర్ల	260.25	77.5
జి.సిగడాం	1.5	0
గార	132.21	41.25
హిరమండలం	200.25	61.75
ఇచ్ఛాపురం	89.18	36.76
జలుమూరు	214.5	46.75
కంచిలి	131.38	91.75
కవిటి	176	93.25
కోటబొమ్మాళి	100.38	125.38
కొత్తూరు	0	0
లావేరు	86.35	38.38
ఎల్.ఎన్.పేట	83.63	4.25
మందస	175.5	184.75
మెళియాపుట్టి	133	142
నందిగాం	99.13	96.5
నరసన్నపేట	245.38	105.5
పలాస	217.4	124.13
పాతపట్నం	19.25	2.5
పోలాకి	246.75	134.25
పొందూరు	0.5	0.5
రణస్థలం	269.5	97.13
సంతబొమ్మాళి	280.75	127.25
సారవకోట	173.75	39
సరుబుజ్జిలి	32	20.25
సోంపేట	6.63	158
టెక్కలి	166.5	140.75
వజ్రపుకొత్తూరు	160.75	5.5



గత నాలుగు నెలల వర్షపాతం (మిల్లీమీటర్లలో)

నెల	కురవాల్సింది	కురిసింది	తేడా
జూన్	116.67	96.97	-19.7
జూలై	184.41	157.61	-26.8
ఆగస్టు	181.94	229.56	+47.62
సెప్టెంబరు	196.15	142.93	-53.22

రేషన్ బియ్యం అందక ఇక్కట్లు
- జీసీసీ డిపోలకు సరఫరా కాని వైనం
8లో

సీజేఐ జస్టిస్ గవాయ్‌పై దాడి దురదృష్టకరం
- వివిధ సంఘాల జేఏసీ నేతల నిరసన
6లో

విద్యార్థుల సృజనకు పదును
- వికసిత్ భారత్ బిల్డథాన్‌కు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం
6లో

అభివృద్ధే లక్ష్యంగా..

- రాజమహేంద్రవరం కార్పొరేషన్‌తో పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ ఎంవోయూ
- 'స్వచ్ఛసహర్ జోడి' కింద కలిసి పనిచేసేందుకు ఒప్పందం



పలాస మునిసిపల్ కార్యాలయం

పలాస, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే లక్ష్యంగా పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ రాజమహేంద్రవరం కార్పొరేషన్‌తో ఎంవోయూ కుదుర్చుకుంది. స్వచ్ఛసహర్‌జోడి కార్యక్రమం కింద కలసి పనిచేసేందుకు ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు గత నెల 29న మునిపాలిటీ చైర్మన్ బళ్ల గిరిబాబు, కమిషనర్ ఎస్.రామారావు సంతకాలు చేశారు. జిల్లాలో ఈ విధంగా ఒప్పందం కుదుర్చుకున్న మొదటి మునిసిపాలిటీగా పలాస-కాశీబుగ్గ నిలిచింది. ఉత్తరాంధ్రలో పలాస-కాశీబుగ్గ, పాలకొండ, ఏలేశ్వ రం, పిఠాపురం, ముమ్మిడివరం మునిసిపాలిటీలు రాజమహేంద్రవరం కార్పొరేషన్‌తో టైఅప్ అయ్యాయి. అభివృద్ధిపై డీపీఆర్ తయారు చేయడం, టెండర్ల (మిగతా 6వ పేజీలో..)

పడవ బోల్తా.. మత్స్యకారుడి మృతి



ఎర్రయ్య (ఫైల్)

రణస్థలం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో పడవ బోల్తాపడి జీరుపాలెం పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన అంబటి ఎర్రయ్య (47) అనే మత్స్యకారుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వాసుపల్లి పోతయ్య, దుమ్ము అప్పన్న, సూరాడ లక్ష్మణతో పాటు ఎర్రయ్య మంగళవారం ఉదయం చేపల వేటకు సముద్రంలోకి పడవపై వెళ్లారు. వేట ముగించుకుని తిరిగి వస్తుండగా భారీ కెరటాలకు పడవ బోల్తాపడి నలుగురు సముద్రంలో పడిపోయారు. ఎర్రయ్య మునిగిపోయి చనిపోయాడు. మిగతా ముగ్గురు సురక్షితంగా ఒడ్డుకు చేరారు. మృతునికి భార్య ఎర్రమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్ర జ్యోతి):జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలే రియా, చికున్‌గున్యా, డయేరియా వంటివి నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తాగునీటి నమూనాలను త్వరితగతిన పరీక్షిం చాలని ఆదేశించా రు. వర్షాల కారణంగా 16 మండలాల్లో పంట నష్టం జరిగినట్లు అధికా రులు కలెక్టర్‌కు వివరించారు. పంట నష్ట నమోదును నిర్దీత గడువులోగా పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంజినీరింగ్ పనుల బిల్లులు పెండింగ్‌లో ఉంచితే సహించేది లేదని హెచ్చరించారు. జీఎస్టీ తగ్గింపుపై వినియోగదారులకు పూర్తి అవగాహన కలిగించాలని కోరారు.

ప్రాణాలు తీస్తున్నాయ్

- సర్పాల కాటుకు నాలుగేళ్లలో 436 మంది మృతి
- రైతులే ఎక్కువ మంది
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు





కూర్మారావు (ఫైల్)

- గత నెల 27న టెక్కలి మండలం బన్నువాడ గ్రామానికి చెందిన వట్టుకుళ్ల కూర్మారావు అనే రైతు పాముకాటుతో మృతి చెందాడు. తన వరి పొలంలో ఎరువు వేసేందుకు వెళ్లిన కూర్మారావును పాము కాటు వేయగా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.
- గత నెల 22న నందిగాం మండలం మోండిరావివలస గ్రామానికి చెందిన సీపాన శ్రీనిధి(10) అనే బాలిక పాముకాటుతో మృతిచెందింది. ఇంటిలో నిద్రిస్తున్న శ్రీనిధిని అర్ధరాత్రి పాటువేసింది. దీన్ని తెలుసుకోలేకపోయింది. బాలిక అపస్మారక స్థితికి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది.



శ్రీనిధి (ఫైల్)



రామకృష్ణ(ఫైల్)

- ఈ ఏడాది జూలై 22న ఎల్ఎన్‌పేట మండలం బత్తాడసింగి గ్రామానికి చెందిన గుమ్మడి రామకృష్ణ(44) అనే రైతు పొలం పనులు చేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.
- ఈ ఏడాది జూలై 10న కవిటి మండలం పూడివీధి గ్రామానికి చెందిన స్వాతిద్రోణ (11) అనే చిన్నారి పాము కాటుకు గురై మృతి చెందింది. రాత్రిపూట ఇంటిలో నిద్రస్తున్న స్వాతితను పాము కాటు వేయడంతో ప్రాణాలు వదిలింది.

టెక్కలి రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాముకాటు మరణాల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది ఇప్పటివరకు పాముకాటుకు గురై 52 మంది వరకు మృత్యువాతపడ్డారు. మరికొందరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అధికంగా రైతులు పాముకాటులకు బలవుతున్నారు. జిల్లాలో ప్రతి ఏడాది వంద నుంచి 150 మంది వరకు పాముకాటుతో మృతి చెందుతున్నారని వైద్యశాఖ అధికారులు తెలుపుతున్నారు. అధికంగా కట్లపాము, నాగుపాము, రక్తపింజరి వంటి విష సర్పాలు కాట్లు వేస్తున్నాయని చెబుతున్నారు. వర్షా కాలంలో ఎక్కువమంది పాముకాట్లకు గురవుతున్నారని, సకాలంలో ఆస్పత్రులకు రాకుండా కొందరు నాటు వైద్యాన్ని ఆశ్రయించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని అంటున్నారు. యాంటీ స్నేక్ వీనమ్ (ఏఎస్‌వీ) ఇంజక్షన్లు అందుబాటులో ఉంటున్నా, క్షేత్రస్థాయిలో వాటి వినియోగంపై వైద్యసిబ్బందికి సరైన అవగాహన కొరవడిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆలస్యం చేయవద్దు..

విష సర్పం కాటు వేసిన ప్రదేశంలో రెండు కోరల గాయం కనిపిస్తుంది. నొప్పి తీవ్రంగా ఉంటుంది. నొప్పి క్రమంగా పైకి వ్యాప్తిచెందుతుంది. ఎక్కడైతే కాటు వేసేందో ఆ భాగాల వైపు తిమ్మిర్లు పట్టడం, నాలుక (మిగతా 6వ పేజీలో..)

కార్మికులపై పిడుగు

(ఐదో పేజీ తరువాయి)

రెండున్నర దశాబ్దాలుగా టెక్కలిలో నివశిస్తున్నాడు. ఈయన గత నెలాఖరు వరకూ టెక్కలి పరిధిలోని గ్యాలాప్ గ్రానైట్ క్వారీలో పనిచేసేవాడు. మూడురోజులు కిందటే ఈయన రాజ్ యోగి క్వారీలో విధుల్లో చేరాడు. మంగళవారం సాయంత్రం క్వారీ ప్రాంతంలో పిడుగుపాటుకు గురై శ్రావణ్‌కుమార్ మృత్యువాతపడ్డాడు. శ్రావణ్‌కుమార్‌కు భార్య సరస్వతి, ఇద్దరు కుమార్తెలు నందిని, అపర్ణ, కుమారుడు సోమిత్‌కుమార్ ఉన్నారు. పెద్ద కుమార్తె తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో వెటర్నరీ వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. చిన్న కుమార్తె గుజరాత్‌లోని వడేదరాలో ఇంజనీరింగ్ చదువుతుంది. కుమారుడు విశాఖలో ఇంటర్ చదువుతున్నాడు. భర్త మృతితో టెక్కలి శ్రీనివాస్‌నగర్‌లో ఉంటున్న భార్య సరస్వతి కన్నీరుమున్నీరుగా విలపిస్తుంది.

ఏం జరిగిందో?

రాజ్‌యోగ్ క్వారీలో ముగ్గురు కార్మికుల మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రానైట్ పరిశ్రమల్లో రాయిని పేల్చేందుకు జిలిటిన్ స్టిక్‌ను వాడుతుంటారు. గతంలో కొన్ని పరిశ్రమల్లో జిలిటిన్ స్టిక్ పేలి పలువురు కార్మికులు మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. ఈ ఏడాది మే 16న దబ్బగూడ గ్రానైట్ పరిశ్రమలో ప్రమాదం జరిగి ముగ్గురు కార్మికులు మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే, తొలుత పిడుగుపడి వీరు మృతి చెందినట్లు యాజమాన్యం తెలిపింది. తీరా అధికారులు, పోలీసులు దర్యాప్తు జరిపిన తరువాత రాయిని పేల్చేందుకు బాంబు పెట్టినప్పుడే పిడుగుపడడంతో పేలుడు జరిగి వారు మృతి చెందినట్లు తెలిసింది. దీనిపై ఇంకా విచారణ జరుగుతుంది. రాజ్‌యోగ్ క్వారీలో కూడా ఇదే విధంగా ప్రమాదం జరిగి ముగ్గురు కార్మికులు మృతి చెందారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతులు ముగ్గురూ కట్టర్లగా పనిచేస్తున్నారు. బాంబులను అమర్చి పేల్చడంలో వీరు నిపుణులుగా తెలుస్తుంది. మంగళవారం కూడా రాయిని పేల్చే సమయంలో పిడుగుపడి ప్రమాదం జరిగి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవున్నాయి. ఏం జరిగిందనేది అధికారుల విచారణలో తేలనుంది. కాగా, ఈ క్వారీలో సుమారు 25 మంది వరకు ప్రతి రోజూ పనులు చేస్తుంటారు. అయితే, దసరా కోసం చాలామంది కార్మికులకు ఇళ్లకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో పెద్దప్రమాదమే తప్పినట్లు అయిందని అంతా అంటున్నారు.

క్వారీల్లో భద్రత డొల్ల..

గ్రానైట్ క్వారీల్లో వరుస ప్రమాదాలు కార్మికులను హడలెత్తిస్తున్నాయి. క్వారీల్లో భద్రత డొల్లతనం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. పిడుగులు పడేటప్పుడు, బ్లాస్టింగ్ సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యాజమాన్యాలు దృష్టి సారించడం లేదనే విమర్శలు ఉన్నాయి. క్వారీల్లో ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మికులకు కొంత పరిహారం అందజేసి చేతులు దులుపుకుంటున్నాయి. పిడుగులు పడే సమయాల్లో ముందస్తుగా సెల్‌ఫోన్‌లకు సమాచారం వస్తున్నా క్వారీల యాజమాన్యాలు కార్మికులతో ఎందుకు పనులు జరిపిస్తున్నాయో అర్థంకాని పరిస్థితి నెలకొంది. అధికార యంత్రాంగం కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తుందనే విమర్శలు ఉన్నాయి.

సిరి సంబరం

- పైడితల్లి సిరిమానోత్సవానికి పోటెత్తిన భక్తులు





సిరిమానోత్సవంలో పోలీసుల బందోబస్తు

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు విజయనగరంలోని పైడితల్లి సిరిమానోత్సవానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం సాయంత్రం ఉత్సవం ప్రారంభానికి కొద్దిసేపటి ముందు వర్షం కురిసినా.. కదలకుండా భక్తులు నిరీక్షించారు. సిరిమానోత్సవం ప్రారంభమైన సమయంలో 'జై పైడితల్లీ' అనే నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. భక్తులతో పాటు కళాబృందాలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

-ఆంధ్రజ్యోతి బృందం



గుడి ఎదుట భక్తుల రద్దీ





పరదా నీడలో సిరిమాను వీక్షణం





అమ్మవారి దర్శనానికి..



నిరాశ పరిచిన 'నైరుతి'

(ఐదో పేజీ తరువాయి)

నవంబరులో సంభవించే తుఫాన్ల కారణంగా జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుంటాయి. ఈదఫా తుఫాన్లు ఏర్పడితే లోటు వర్షపాతం కచ్చితంగా అధిగమించే అవకాశముంది. అయితే, తుఫాన్ల తీవ్రత ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళన చెందుతుంటారు.

ప్రాణాలు తీస్తున్నాయ్

(ఐదో పేజీ తరువాయి)

మందగించడంతోపాటు గొంతు కండరాలు బిగుసుకుపోవడం జరుతాయి. కొందరిలో కళ్లు మగతగా మారి స్పృహ కోల్పోవడం జరుగు తుంది. పాముకాటు వేసిన 15 నిమిషాల్లో ఆసుపత్రికి వెళ్తే ముప్పు తప్పుతుందని వైద్యులు చెబుతున్నారు.

ఇలా చేయండి..

రైతులు పొలాల వైపు వెళ్తే చప్పుడు చేస్తూ నడవడం మంచిది. చేతిలో కర్ర ఉంచుకోవాలి. రాత్రి వేళ టార్చిలైట్‌ను వెంట తీసుకు వెళ్లాలి. ఇంటి చుట్టూ చెత్తాచెదారం లేకుండా చూసు కోవాలి. పాము కాటుకు గురైన వారికి ధైర్యం చెప్పాలి. భయంతో కొందరు ప్రాణాలు కోల్పో వడం జరుగుతుంది. కాటు వేసిన భాగాన్ని కత్తి, బ్లేడ్‌తో కోయవద్దని వైద్యులు చెబుతు న్నారు. గాయం పైభాగంలో వస్త్రంతో గట్టిగా కట్టి ఆసుపత్రికి తీసుకువెళ్లాలి. కొంత మంది నాటు వైద్యం పేరుతో ఆలస్యం చేయటం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. అధికంగా గిరిజన గ్రామాల్లో ఈ పరిస్థితి ఉంది.

నాలుగేళ్లలో 436 మంది..

జిల్లాలో గత నాలుగేళ్లలో పాముకాటుకు గురై 436 మంది మృతిచెందినట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2021-22లో 4,380 మంది పాముకాటుకు గురవగా 130 మంది మృతి చెందారు. 2022-23లో 5160 మందికి కాటు వేయగా 150 మృత్యువాతపడ్డారు. 2023-24లో 3,024 మందికి కాటు వేయగా 104 మంది, 2024-25(సెప్టెంబరు 30) వరకు 1330 మంది పాటుకాటుకు గురవగా 52 మంది మంది వరకు మృతి చెందారు.

వెంటనే ఆస్పత్రికి తరలించాలి..

పాము కాటుకు గురైన వారిని వెంటనే సమీపంలో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లాలి. ఆలస్యం చేయడం వల్ల ప్రాణాలు పోతాయి. వర్షాల కారణంగా జూన్ నుంచి జనవరి వరకు అధికంగా పాముకాటు ప్రమాదాలు జరుగుతుంటాయి. రైతులు పొలాలకు వెళ్లేటప్పుడు కర్ర పట్టుకుని దూరం నుంచి చప్పుడు చేస్తూ నడవడం మంచిది.

-పావని, వైద్యాధికారి, చాపర ఆరోగ్యకేంద్రం

అభివృద్ధే లక్ష్యంగా..

(ఐదో పేజీ తరువాయి)

ప్రక్రియను పరిశీలించడం, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలపై సలహాలు, సూచనలు చేసి మునిసిపాలిటీని అధికారులు ప్రగతిపథంలో నడిపించనున్నారు.

అనేక సవాళ్లు..

ప్రస్తుతం పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ అనేక సవాళ్లను ఎదుర్కొంటుంది. ముఖ్యంగా పారిశుధ్య సమస్య తీవ్రరూపం దాల్చింది. 31 వార్డులు ఉన్న మునిసిపాలిటీలో కనీసం 200 మందికి పైగా పారిశుధ్య కార్మికులు పనిచేయాల్సి ఉంది. కానీ, 75 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో పారిశుధ్య పనులు కేవలం 30 మంది మాత్రమే చేస్తున్నారు. వీరితో పనులు చేయించడం అధికారులకు తలనొప్పిగా మారింది. ప్రతిరోజూ 50 టన్నులకు పైగా చెత్త పోగవుతుంటుంది. 9 ఎకరాల ఉండే డంపింగ్ యార్డు సైతం నిండుకుండగా మారింది. 16 వార్డు సచివాలయాలకు 8 మంది శానటరీ సెక్రటరీలు మాత్రమే ఉన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాల్లో భాగంగా పారిశుధ్యం మెరుగుపరుద్దామన్నా నిధులు, సిబ్బంది లేకపోవడంతో అధికారులు సైతం చేతులు ఎత్తేసే పరిస్థితి ఏర్పడింది. శ్రీకాకుళం, విజయనగరం కార్పొరేషన్లు, విశాఖ నగరపాలకసంస్థ ఉన్నా వాటి నిధులు వాటికే సరిపడుతున్నాయి. దీంతో రాజమహేంద్రవరం కార్పొరేషన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దీనివల్ల ఈ ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ముఖ్యంగా పారిశుధ్య పరిస్థితి మెరుగుపడనుంది. పారిశుధ్య సిబ్బందిని కూడా అదనంగా నియమించుకునేందుకు వీలుంటుంది. ఈ విషయమై కమిషనర్ ఎన్.రామారావును వివరణ కోరగా 'రాజమహేంద్రవరం కార్పొరేషన్‌తో ఎంవోయూ కుదుర్చుకున్నాం. ఇది అమలు జరిగితే ముఖ్యంగా పారిశుధ్యంపై దృష్టి పెట్టడానికి ఎక్కువగా అవకాశం ఉంటుంది. నిత్యం చెత్త సమస్యలతో ఇబ్బందులు పడుతున్న పలాస-కాశీబుగ్గకు ఉపసమనం కలుగుతుంది.' అని అన్నారు.



శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు

కవిటి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ముత్యాలపేటలోని మహామృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలోని శివలింగాన్ని మంగళవారం ఉదయం సూర్యకిరణాలు తాకాయి. శివాలయంలోనున్న నందీశ్వరుని విగ్రహాన్ని తాకిన తర్వాత గర్భగుడిలోని శివలింగాన్ని కిరణాలు తాకాయి. ఉదయం 7 గంటల సమయంలో పూజలు నిర్వహిస్తున్న సమయంలో ఈ దృశ్యం కనిపించింది. దీంతో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకొని పూజలు చేశారు.

సీజేఐ జస్టిస్ గవాయ్‌పై దాడి దురదృష్టకరం

- దళిత, ఆదివాసీ, బహుజన, మైనార్టీ సంఘాల జేఏసీ నేతలు

శ్రీకాకుళం అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి యత్నం దురదృష్టకరమని వివిధ సంఘాల ప్రతినిధులు ఖండించారు. ఈ మేరకు శ్రీకాకుళంలో దళిత, ఆదివాసీ, బహుజన, మైనార్టీ సంఘాల నేతలు మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. నగరంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద మానవహారం చేపట్టారు. దళిత, ఆదివాసీ, బహుజన, మైనార్టీ సంఘాల జేఏసీ నేతలు తైక్వాండో శ్రీను, కంఠ వేణుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి పిట్ట దామోదరరావు, ఉపాధ్యక్షులు సీతరాజు, ప్రతినిధులు బి.మురళీకృష్ణ, జె.శ్రీనివాసరావు, చలపతిరావు, రాజ్‌కుమార్, దళిత, ఆదివాసీ, బహుజన మైనార్టీ నాయకులు బడే కామరాజు, ముంజేటి కృష్ణ, బాడాన దేవభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇది మాయని మచ్చ..

శ్రీకాకుళం లీగల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ మీద దాడి యత్నాన్ని ముక్తకంఠంతో ఖండిస్తున్నామని శ్రీకాకుళం జిల్లా బీసీ న్యాయవాదుల సంఘం, న్యాయవాదుల సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం జిల్లా కోర్టు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు న్యాయవ్యవస్థకే మాయని మచ్చగా మిగులుతాయని అన్నారు. బీసీ న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, న్యాయవాదులు వాన కృష్ణచంద్, మామిడి క్రాంతి, పేరూరి నాగేశ్వరరావు, సనపల హరి, కంచరాన నాగభూషణరావు, కొమర శంకర్, సుదర్శన్, వి.కృష్ణారావు, శంకరనారాయణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ఐలూ ఆధ్వర్యంలో..

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించడం పై అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలూ) శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కోర్టు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఐలూ జిల్లా అధ్యక్షుడు దుంపల రామారావు, డొంకాన ఈశ్వరరావు, కూన అన్నంనాయుడు, శిమ్మ రాంబాబు, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సృజనకు పదును

- వికసిత్ భారత్ బిల్డథాన్‌కు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం
- అన్ని విద్యా సంస్థల్లో అమలుకు కసరత్తు
- ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు అవకాశం
- రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 13 వరకు గడువు



నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల

విద్యార్థుల ప్రతిభకు.. సృజనాత్మకతకు మెరుగులు దిద్దే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో 'వికసిత్ భారత్ బిల్డథాన్' పేరుతో మరో కార్యక్రమానికి కేంద్రం రూపకల్పన చేసింది. ఇది విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

నరసన్నపేట, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థుల సృజనాత్మకతకు మరింత పదును పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ బిల్డథాన్-2025 పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోంది. దీనిపై ఇప్పటికే జిల్లా విద్యా శాఖకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యా సంస్థల్లో దీనిని అమలు చేయడానికి విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా వికసిత్ భారత్ బిల్డథాన్-2025ను నిర్వహించాలని కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ఆదేశించారు. దీనిలో భాగంగా జిల్లాలోని అన్ని పాఠశాల ఉపాధ్యాయులు ఆరు నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న మూడు నుంచి ఏడుగురు విద్యార్థులను గ్రూపులుగా చేసి వికసిత్ భారత్ బిల్డథాన్ పోర్టల్‌లో ఈనెల 13వ తేదీలోగా నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రత్యక్ష సమకాలీన, ఆవిష్కరణ కార్యక్రమం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి సంబంధిత థీమ్స్‌పై వివరణ, చేసే పద్ధతిపై లైవ్ ఇంటరాక్షన్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను జిల్లా విద్యాశాఖ అధికారులు అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లకు పంపించారు.

లక్ష్యాలు ఇవే..

- ఆత్మనిర్భర్ భారత్ స్వావలంబన వ్యవస్థలు, సాధనాలు, పరిష్కారాలను కనుగొనడం.
- స్వదేశీ ఆలోచనలు, జ్ఞాన వ్యవస్థలు, ఆవిష్కరణలను ప్రోత్సహించడం.
- స్థానిక ఉత్పత్తులు, వనరులను ప్రోత్సహించడం.
- దేశస్థిరమైన అభివృద్ధికి మార్గాలను సృష్టించడం.

ఉపాధ్యాయుల పాత్ర..

- విద్యార్థి బృందాలకు మార్గదర్శకత్వం.
- ఆలోచన, సమస్య పరిష్కారం, నమూనా అభివృద్ధిపై మార్గదర్శకత్వం అందించడం.
- రిజిస్ట్రేషన్, సమర్పణలో సాయం చేయడం.
- పోర్టల్ రిజిస్ట్రేషన్, సమర్పణ (ఆలోచన/నమూనా) ప్రక్రియలో విద్యార్థులకు సాయం చేయడం.
- థీమ్‌లను వివరించడం, స్థానిక సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వడం, ఆత్మనిర్భర్ భారత్‌ను ప్రోత్సహించడం.

విద్యార్థులు ఏం చేయాలంటే..


ఆరు నుంచి 12 తరగతుల విద్యార్థులు 3 నుంచి ఏడుగురు సభ్యుల బృందంలో చేరాల్సి ఉంటుంది. ఆలోచనలకు, వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలను అభివృద్ధి చేయడం, నమూనాలను రూపొందించవలసి ఉంటుంది. విద్యార్థుల ఆలోచనకు సంబంధించి భౌతిక లేదా డిజిటల్ నమూనాను రూపొందించడానికి కలిసి పని చేయాల్సి ఉంటుంది. సంబంధిత నమూనాకు చెందిన వీడియోను (2 నిమిషాల కంటే తక్కువ నిడివి) తయారు చేసి పోర్టల్‌లో సమర్పించాల్సి ఉంటుంది.

పాఠశాలలకు సమాచారం ఇచ్చాం..



జిల్లాలో ప్రతి పాఠశాల, కళాశాల నుంచి కనీసం 50 మంది విద్యార్థులతో ఏడు చొప్పున బృందాలను ఏర్పాటు చేయాలి. ఈ నెల 13లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దీనిపై సైన్స్ టీచర్లకు అవగాహన కల్పించాం. డీఈవో నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తాం.

-కుమార స్వామి, జిల్లా సైన్స్ అధికారి



హై'టెన్షన్' టవర్!

అరసవల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పొన్నాడ వంతెన దిగువన.. సాయిగిరి సమీపంలో నాగావళి నది ఒడ్డున హైటెన్షన్ విద్యుత్తు టవర్‌ను పిచ్చి మొక్కల తీగెలు పూర్తిగా అల్లుకున్నాయి. దిగువ నుంచి పైవరకు అల్లుకున్న ఈ తీగెల ద్వారా విద్యుత్తు ప్రవహిస్తే... ఊహించని నష్టం జరగడం ఖాయం. నిత్యం వేలాదిగా ప్రజలు బ్రిడ్జిపై నుంచి వెళుతుంటారు. ఇంత ప్రమాదకరంగా కనిపిస్తున్నా.. విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ టవర్‌కు అల్లుకున్న తీగెలను తొలగించి... అపాయం నుంచి రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

వాల్మీకి బోధనలు మానవాళికి మార్గదర్శకం

● డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి బోధనలు మానవాళికి మార్గ దర్శకాలని డీఆర్వో ఎం. వేంకటేశ్వరరావు అన్నారు. కలెక్ట రేట్ సమావేశ మందిరంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు మంగళ వారం నిర్వ హిం చారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మానవజాతి మనుగడ ఉన్నంతకాలం ఇవి సజీవ మన్నారు. వాల్మీకి నిర్దేశించిన విలువలను పాటిస్తూ జీవనం సాగిస్తే మాన వ సమాజమే ఒక నందనవనంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షే మాధికారి అనూరాధ, కలెక్టరేట్ ఏవో సూర్యనారాయణ, జడ్పీ సీఈవో డి.సత్యనారాయణ, సెట్విన్ సీఈవో అప్పలనాయుడు, ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రప టానికి ఏఎస్పీ కేవీ రమణ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ.. రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి ఆలో చనల నుంచి స్ఫూర్తి పొందాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శేషాద్రి, ఏవో గోపీనాథ్, సీఐ శ్రీనివాస్, ఆర్ఐలు నరసింగరావు, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.



వాల్మీకి మహర్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

బీఆర్ఏయూలో..

ఎచ్చెర్ల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూని వర్సిటీలో మహర్షి వాల్మీకి జయంతిని మంగళవారం నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని పూలమాల వేసి నివాళులర్పించారు. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారనేందుకు వాల్మీకి జీవితమే నిదర్శన మన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాల్ సీహెచ్ రాజశేఖరరావు, కె.సామ్రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

లావేరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వసతి గృహ పరిసరాల్లో పరిశుభ్రతను పాటించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. మంగళవారం లావేరు బీసీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో మౌలిక సదుపాయాలు, ప్రభుత్వం అందిస్తున్న మెనూ, విద్యార్థుల గదులను పరిశీలించారు. హాస్టల్ అపరిశుభ్రంగా కనిపించడంతో వార్డెన్ పై ఆగ్రహం వ్యక్తంచేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని వార్డెన్ రమేష్‌బాబుని ఆదేశించారు. కార్యక్రమంలో న్యాయవాది జె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సముద్ర తాబేళ్ల సంరక్షణ అవసరం

కవిటి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సముద్ర తాబేళ్లను రక్షించి వాటి పెంపకానికి మత్స్యకారులు సహకరించాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాము కోరారు. బట్టివానిపాలెంలో మత్స్యకారులకు మంగళవారం తాబేళ్ల సంరక్షణపై అవగాహన కలిగించారు కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ రవికుమార్, ట్రీ ఫౌండేషన్ జిల్లా కోర్డినేటర్ కె.సోమేశ్వ రరావు, మత్స్యకారులు పాల్గొన్నారు.

ఆదిత్యాలయంలో క్షురకునిపై దాడి

● దినసరి వేతన ఉద్యోగి నిర్వాకం
● ఆలస్యంగా వెలుగులోకి..

అరసవల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో నిత్యం పలు వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. నాలుగు రోజుల కిందట కేశ ఖండనశాలలో పనిచేస్తున్న తన తండ్రి వయసున్న ఓ క్షురకుడిపై దినసరి వేతన సిబ్బంది దాడి ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో సదరు క్షురకుడు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అలాగే ఆ మరుసటి రోజు కూడా మరలా దాడిచేసి కొట్టినట్లు తెలిసింది. దీంతో ఈ వివాదం పెద్దదై పోలీసులకు ఫిర్యాదు చేసేవరకు వెళ్లింది. అయితే ఆలయ ప్రతిష్ఠ దిగజారిపోతుందనే భావనతో మిగిలిన క్షురకులు ఈ విషయం బయటకు పొక్కకుండా సర్దుబాటు చేశారు. సదరు దినసరి వేతన సిబ్బంది ఇటీవల టీడీపీలో చేరిన ఓ చోటా నేత కుమారుడు కావడంతో అందరూ మిన్నకుండి పోయారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే తనకు జరిగిన అన్యాయంపై ఆ క్షురకుడు, అతని కుమారుడు కొంతమంది పెద్దల వద్ద వాపోయారు. ఈ విషయం ఇంతవరకు ఆలయ ఈవోకి చేరలేదని తెలుస్తోంది.

గతంలో కూడా ఇదే దినసరి ఉద్యోగి తనను విధుల నుంచి తప్పిస్తారనే భయంతో ఆత్మహత్యాయత్నం నాటకం ఆడి, అధికారులను బెదిరించి విధుల్లో కొనసాగుతున్నాడన్న వాదన లొస్తున్నాయి. ఇదే ఉద్యోగి కేశ ఖండన శాలలో టిక్కెట్ల జారీలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు, చిల్లర పది రూపాయలు ఇవ్వడం లేదని, అలాగే టోకెన్లు ఇవ్వకుండా భక్తుల నుంచి డబ్బులు తీసుకుని కేశ ఖండన చేయిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఆలయ అధి కారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

నేడు శ్రీకూర్మం ఆలయ ట్రస్టుబోర్డు ప్రమాణం

గార, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మంలోని ప్రసిద్ధ శ్రీకూర్మనాథ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఈవో కె.నరసింహ నాయుడు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో సభ్యులంతా పాల్గొనాలని కోరారు.

వాటర్ ఫిల్టర్ వితరణ

సోంపేట రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎర్రముక్కాం అంగన్‌వాడీ కేంద్రానికి గ్రామానికి చెందిన మడ్డు చంద్రశేఖర్ వాటర్ ప్యూరిఫైర్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను అంగన్‌వాడీ కార్యకర్త రాజేశ్వరి, పిల్లల తల్లిదండ్రులు అభినందించారు.

యువకుల రక్తదానం

ఎచ్చెర్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం పంచాయతీ రుప్పపేట గ్రామంలో రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది యువకులు రక్తదానం చేయగా వారిని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అభినందించారు.

ఓట్ చోరీపై సంతకాల సేకరణ

ఆమదాలవలస, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ ఆదేశాల మేరకు ఆమదాలవలసలో మంగళవారం ఓట్ చోరీపై పీసీసీ ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు ఆధ్వర్యంలో సంతకాలను సేకరించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ చేస్తున్న పోరాటానికి మద్దతుగా సంతకాలు సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆటో ఢీకొని యువకుడి మృతి


మృతిచెందిన విజయ్

హరిపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): లగేజ్ ఆటో ఢీకొని నవర విజయ్(29) అనే యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం మందస మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తంగరపుట్టి గ్రామానికి చెందిన విజయ్ మందస వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా... రాయికోల గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న లగేజీ ఆటో ఢీకొంది. గాయపడిన యువకుడ్ని వెంటనే పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందించగా.. తలపై తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో హల్‌చల్ చేసిన వ్యక్తికి జైలు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పూటుగా మద్యం తాగి నడిరోడ్డుపై హల్‌చల్ చేసి వ్యక్తికి శ్రీకాకుళం సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి శివరామకృష్ణ 45 రోజులు జైలుశిక్ష విధించినట్టు ట్రాఫిక్ సీఐ నాగరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సోమవారం నగరంలోని పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఎస్ఐ సోమశేఖర్ వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ నిర్వహిస్తుండగా దమ్మలవీధికి చెందిన తిరిమి సాయిరాజు మద్యం తాగి నడిరోడ్డుపై వీరంగం సృష్టించి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించాడు. దీంతో ఆయనకు డ్రంకెన్‌డ్రైవ్ టెస్ట్ నిర్వహించి కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. విచారణ అనంతరం సాయిరాజుకు 45 రోజులు జైలుశిక్ష విధించారు.

16 ద్విచక్ర వాహనాల సీజ్


సీజ్ చేసిన వాహనాలతో పోలీసులు

ఇచ్ఛాపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): బుడ్డేపుపేట గ్రామంలో రూరల్ ఎస్ఐ ఇ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 16 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. అనుమానితులు సంచరిస్తే సమాచారం అందించాలని స్థానికులను కోరారు.

13 మద్యం సీసాల స్వాధీనం

ఇచ్ఛాపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పాయితారి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 13 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ ఇ.శ్రీనివాస్ తెలిపారు. పాయితారి గ్రామానికి చెందిన ఇ.భీమారావు ఇంటిలో మంగళవారం తనిఖీ చేపట్టి వీటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఇరువర్గాల కొట్లాటలో ఆరుగురి అరెస్టు

రణస్థలం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నారువ పంచాయతీ గొల్ల మెంటాడ గ్రామంలో జరిగిన భూ వివాదంలో ఇరువర్గాలకు చెందిన ఆరుగురిని మంగళవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గొల్ల మెంటాడలో దుక్క సూరి, దుక్క సన్యాసికి మధ్య గతేడాది నుంచి భూ వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో వీరిపై పలుసార్లు కేసులు నమోదయ్యాయి. తాజాగా సోమవారం ఇరువర్గాలు కొట్లాటకు దిగడంతో దుక్క సూరి వర్గీయులు నలుగురిని, దుక్క సన్యాసి వర్గీయులు ఇద్దర్ని కలిపి మొత్తం ఆరుగురిని అరెస్టు చేసినట్టు జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల..

కంచిలి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధి కొత్త చెరువుగట్టు వద్ద సోమవారం రాత్రి పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు. కొత్తచెరువు గట్టుపై పేకాట ఆడుతున్నట్టు వచ్చిన సమాచారంతో సోమవారం రాత్రి 11.30 గంటలకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. పేకాట ఆడుతున్న బీసీ కాలనీకి చెందిన ఓగిరాల ప్రతాప్, ఎంఎస్ పల్లికి చెందిన పైల శ్రీనివాసరావు, బుడ్డేపు లింగరాజు, ఏఎస్ పల్లికి చెందిన కొరికాన జంపయ్య, సిర్తలికి చెందిన బానికెల దాలయ్య, పెద్ద అంపురానికి చెందిన మద్ది ఢిల్లేశ్వరరావు, జిల్లుండకు చెందిన అరుణ్ గౌడలను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.41,100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

యోగాతో మానసిక ప్రశాంతత


యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

నరసన్నపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సత్యవరం ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సమగ్రశిక్ష ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా, ధాన్యంపై అవగాహన నిర్వహించారు. మానసిక ఆరోగ్యం పెంపుదించేందుకు యోగా, ధ్యానం దోహదపడుతుందని జిల్లా కేరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ పి.రాజశేఖర్ అన్నారు. హెచ్‌ఎం వకుల రత్నమాల, అప్పన్న, కేశవరావు, జ్యోతిరాణి, లక్ష్మణరావు, లీలావతి పాల్గొన్నారు.

శాశ్వత భవనానికి స్థలం కేటాయించండి

కవిటి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కవిటి పీఏసీఎస్ కార్యాలయానికి శాశ్వత భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఛైర్మన్ ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, సీఈవో బి.చిరంజీవి కోరారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్‌ను రామయ్యపుట్టుగలో కలిసి వినతిపత్రం అందించారు. ప్రస్తుతం అద్దె భవనంలో నిర్వహిస్తున్నందున ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో పలువురు రైతులు ఉన్నారు.

రేషన్ బియ్యం అందక ఇక్కట్లు

- జీసీసీ డిపోలకు సరఫరాకాని వైనం
- ఇబ్బందిపడుతున్న గిరిజనులు


సరుకులు లేక మూతవేసిన నరహరిపురం జీసీసీ డిపో

టెక్కలి రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో అధికంగా రేషన్ షాపులకు బియ్యం రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెలా 30వ తేదీలోపు ఎంఎస్ గోదాం నుంచి రేషన్ షాపులకు బియ్యం తరలించాల్సి ఉండగా ఈనెల మాత్రం 4వ తేదీ వచ్చినా తరలింపులు జరగలేదు. దీంతో డిపోల వద్దకు రేషన్ కోసం లబ్ధిదారులు వచ్చి ఖాళీ చేతులతో వెనుదిరుగుతు న్నారు. ప్రభుత్వం ప్రతి నెలా 25 నుంచి 30వ తేదీ వరకు వృద్ధులకు, 1 నుంచి 15వ తేదీ వరకు ఇతరులకు పంపిణీ చేయాల్సి ఉంది. అయినా నిత్యావసర సరుకులు తరలించకపోవడంతో డీలర్లు సైతం ఆందోళన చెందుతున్నారు. సకాలంలో రేషన్ అందక దసరా పండగ రోజుల్లో కొంతమంది అధిక ధరలకు బియ్యం కొనుగోలు చేసుకోవాల్సి వచ్చింది. మండలంలో అధికంగి జీడిపేట, నరహరిపురం జీసీస డిపోలు ఉన్నాయి. ఈ డిపోల పరి ధిలో ఉన్న వారంతా గిరిజనులే. వీరంతా ప్రభుత్వం ఇస్తున్న బియ్యం తినే బతుకు సాగిస్తున్నారు. అందువల్ల ఇప్పటికైన సంబంధిత అధి కారులు స్పందించి సకాలంలో రేషన్ సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతు న్నారు. దీన్నిపై సీఎస్‌డీటీ కూమార్ మాట్లాడుతూ.. సాంకేతిక కారణాలు వల్ల సివిల్ సప్లై నుంచి మం డల గోదాములకు రేషన్ సరుకులు రాకపోవడం ఆలస్యం జరుగుతుంది. రెండు రోజుల్లో అన్ని డిపోలకు సరుకులు అందజేస్తాం.

నూతన భవనాలు నిర్మించండి


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని పాతపట్నం, హిరమండలాల్లో సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాలకు నూతన భవనాలు మంజూరు చేయాలని ఆ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర సచివాలయ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. పాతపట్నంలో గల సబ్ రిజిస్ట్రర్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుందని, హిరమండలంలో అద్దె భవనంలో కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా అక్కడి పరిస్థితులను వివరించారు.

ఎండల మల్లన్న ఆలయ హుండీల లెక్కింపు

టెక్కలి రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రావివలస గ్రామ సమీపంలో గల ఎండల మల్లికార్జున ఆలయ హుండీలను మంగళవారం లెక్కించారు. 126 రోజులకు గాను రూ.1,50,556 ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ ఈవో గురునాథ్ తెలిపారు.

మంటలు చెలరేగి కారు దగ్ధం


కాలిపోయిన కారు

హరిపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మందస మండలం అంబుగాం గ్రామంలో పార్కింగ్ చేసిన కారులో మంటలు చెలరేగి దగ్ధమైంది. మంగళవారం ఉదయం కారు నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు గమనించి అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని పూర్తి స్థాయిలో మంటలను అదుపు చేశారు. దీంతో పక్కనే ఉన్న మరికొన్ని వాహనాలకు నిప్పు అంటుకోకుండా ప్రమాదం తప్పింది. వాహనంలో షార్ట్ సర్క్యూట్ వల్లనే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ ఘటనపై మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గండ్లు పూడ్చివేతకు చర్యలు

హరిపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తుఫాన్ వర్షాలతో ఏర్పడిన కాలువల గండ్లను సకాలంలో పూడ్చి రైతులకు ఇక్కట్లు లేకుండా చూస్తామని జలవనరుల శాఖ ఏఈఈ శ్రీనివాసరావు అన్నారు. మందస మండలంలో ఇటీవల కొట్టుకుపోయిన పలు కాలువల గండ్లను ఆయన మంగళవారం ఆశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు.

గంజిని వడపోయొద్దు


ఆహార పదార్థాలు పరిశీలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్

ఆమదాలవలస/ ఎచ్చెర్ల/ లావేరు/ శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే అన్నం వండే సమయంలో గంజిని వడపోయవద్దని, అత్తెసరుగా వండడం వల్ల దానిలో ఉండే విటమిన్లతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయ ప్రతాప్ రెడ్డి సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన శ్రీకాకుళం నగరం, ఆమదాలవలస, ఎచ్చెర్ల, లావేరు మండలాల్లోని వసతిగృహాలు, గురుకుల పాఠశాల/ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రా లు, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, రేషన్ డిపోలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినీ విద్యార్థులతో మాట్లాడి ఆహార పదార్థాల నాణ్యతపై ఆరా తీశారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి


ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పలాసరూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకను వెలికి తీసి వారిని నైపుణ్యం సాధించేలా చూడాల్సిన ఆవశ్యకత ఉపాధ్యాయులపై ఉందని సత్యసాయి విద్యావిహార్ ట్రస్టు ఛైర్మన్ మల్లా రామేశ్వరరావు అన్నారు. పలాస మండలం రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌లో మంగళవారం విద్యార్థులు సృజనాత్మకంగా తయారు చేసిన వివిధ ప్రయోగాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు దసరా సెలవుల్లో విద్యార్థులు తయారు చేసిన 300 ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, ఉపాధ్యాయులు మురళి, సూర్యతేజ, అనుదీప్, లావణ్యకృష్ణ, జీవరత్నం, సాంబమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీగురుకుల విద్యాలయం విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులు

పలాసరూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు జిల్లా స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో కాశీబుగ్గ శ్రీగురుకుల విద్యాలయం విద్యార్థులు ప్రతిభ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. త్రోబాల్ అండర్-17 విభాగంలో 10వ తరగతి విద్యార్థినులు కింతల శ్రీలత, పిట్ట మేఘన, డొక్కరి జాహ్నవి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీ అండర్-14 విభాగంలో 9వ తరగతి విద్యార్థి రాయల జయవర్ధన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కాగా పొట్నూరు సుబ్రహ్మణ్యం షాట్ పుట్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు స్కూల్ ప్రిన్సిపాల్ అశోకవర్ధన, డైరెక్టర్ కృష్ణమూర్తి మంగళవారం అభినందనలు తెలిపారు. పీడీ ప్రవీణ్‌కుమార్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

జీఎస్టీపై అవగాహన కల్పించాలి


అవగాహన పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

జి.సిగడాం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంపై మండల వ్యాప్తంగా అవగాహన కల్పించాలని ఆత్మనిర్భర్ భారత్ జిల్లా కార్యకర్గ సభ్యుడు, జిల్లా కార్యదర్శి వజ్జపర్తి రఘురాం అన్నారు. మంగళవారం అధికారులు, కూటమి నేతలతో కలిసి వివిధ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కలిగించారు. ఎంపీడీవో జి.రామకృష్ణ, విద్యుత్ శాఖ ఏఈ పి.దుర్గాప్రసాద్ తదితరులను కలిసి సమస్యలపై వినతిపత్రాలను అందించారు. బీజేపీ మండల అధ్యక్షుడు పైల విష్ణుమూర్తి, నేతలు ముద్దాడ త్రినాథ, ముద్దాడ గౌరి, సీహెచ్ ఉమామహేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఎరువులు సకాలంలో అందించండి

పలాసరూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఎరువులను సకాలంలో అందించాలని సర్పంచ్ భాస్కరరావు, ఎంపీటీసీ సభ్యుడు బి.దుర్యోధన, చినంచల రైతులు మంగళవారం ఆ గ్రామ సచివాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. తమకు సరైన సమయంలో యూరియా అందించడం లేదని, అధికారులు వారికి నచ్చిన వారికి అందిస్తున్నారని వాపోయారు. ఇదిలావుంటే యూరియా ఇవ్వలేదని కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని కూటమి నాయకులు అన్నారు. చినంచల పంచాయతీలో 750కు పైగా యూరియా బస్తాలను అందజేశామని, రెండురోజుల్లో మరో 400 బస్తాలను ఇవ్వనున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకునే ప్రభుత్వమని, బురద రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు.

నేడు మండల సమావేశం

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం బుధవారం మండలం పరిషత్ కార్యాయం మందిరంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎన్.రమేష్‌నాయుడు చెప్పారు. ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు పూర్తిస్థాయి సమాచారంలో రావాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కాశీబుగ్గ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): అండర్-14 అథ్లెటిక్స్‌లో కూర్మపు ప్రణీత్, అండర్-17 త్రో బాల్‌లో నవర ఆదిత్య జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు చినబాడాం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చింతాడ ఉషారాణి అన్నారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో వారిని అభినందించారు.

● నందిగాం: పెద్దతామరాపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి చదువుతున్న ఇప్పిలి వర్ష అండర్-19 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం బమ్మిడి నాగమునీష్ తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలో జరగనున్న రాష్ట్ర పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. అండర్-17 విభాగంలో వనమాలి ఢిల్లేశ్వరి 800 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానంలో నిలిచింది.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

కొత్తూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి) యోగా సాధనతో విద్యార్థుల్లో మానసిక ప్రశాంతత పొందవచ్చని జిల్లా మానిసిక ఆరోగ్య కౌన్సిలర్ అంపిలి ప్రశాంత్ కుమార్ అన్నారు. ప్రపంచక మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో బాగంగా మంగళవారం ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులకు యోగాపై అవగామన కల్పించారు.

రోడ్డు సాధనకు కమిటీ ఏర్పాటు

సంతబొమ్మాళి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వడ్డితాండ్ర-రావివలస రహదారి నిర్మాణం కోసం సాధన పోరాట కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, సాధన కమిటీ కన్వీనర్ కోత మధుసూదనరావు తెలిపారు. బ్రిటీష్ కాలం నుంచి ఎంతో ప్రాముఖ్యత గల ఈ రహదారి పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు. గతంలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉన్న ఈ రహదారి ఆర్‌అండ్‌బీ శాఖకు మారినా ఫలితం లేకపోయిందన్నారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయ్యేవరకు ధర్నాలు, ర్యాలీలు చేస్తామన్నారు.

అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

హిరమండలం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గొట్టా బ్యారేజీతో పాటు, వంశధార ఎడమ ప్రధాన కాలువ పరిధిలో అభివృద్ధి పనులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించనున్నట్టు వంశధార ప్రాజెక్టు ఎస్ఈ జి.రామచంద్రరావు చెప్పారు. మంగళవారం వంశధార రిజర్వాయర్, ఎత్తిపోతలు పథకం పనులు, బ్యారేజీ దిగువన మరమ్మతులకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. గొట్టాబ్యారేజి నిర్మాణం చేపట్టి 50 సంవత్సరాలు కావస్తుండటంతో కొన్ని మరమ్మతులు చేపట్టాల్సి ఉందన్నారు. జడ్డిస్టోన్ ఏప్రాన్, గేట్లు మరమ్మతులు చేపట్టాల్సి ఉందన్నారు.

నివారణ చర్యలు తీసుకోవాలి

కోటబొమ్మాళి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వరిపంటకు సోకే చీడపీడల నివారణకు చర్యలు తీసుకోవాలని టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్మోహన్ రావు అన్నారు. మంగళవారం ఏవో ఎస్.గోవిందరావుతో కలిసి ఆయన కోటబొమ్మాళిలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్స్ సంఘం అధ్యక్షుడు బోయిన రమేష్, పంచాయతీ కార్యదర్శి చింతాడ సన్యాసిరావు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విజేతలు

పోలాకి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గుప్పెడుపేట ఉన్నత పాఠశాలలో మంగళవారం జీఎస్‌టీ(గూడ్స్ సర్వీస్ టాక్స్) అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతల వివరాలను సచివాలయ కార్యదర్శి ప్రసాదరావు, హెచ్‌ఎం గురుగుపల్లి రాజశేఖర్, మత్స్యకార విభాగ ప్రతినిధి ఢిల్లీశ్వరరావు విలేకరులకు వివరించారు. సీనియర్స్ విభాగంలో సీహెచ్.ప్రమీల ప్రథమ, సంజన ద్వితీయ, జూనియర్స్ విభాగంలో ఎం.షైడిరాజు ప్రథమ, ఆర్.కామేశ్వరి ద్వితీయ స్థానంలో నిలిచినట్టు తెలిపారు. అనంతరం జీఎస్‌టీపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పలాస, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభి వృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి శిక్షణ కోర్సులకు సంబంధించి ఉచిత శిక్షణ స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఇవ్వనున్నట్టు ప్రిన్సిపాల్ పైల జవహర్, జిల్లా నైపుణ్యా భివృద్ధి సంస్థ అధికారి యు.సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బ్యూటీథెరిఫిస్ట్ కోర్సులో ఈ శిక్షణ ఇస్తున్నామని, పదో తరగతి, ఆపైన ఉతీర్ణత సాధించిన 18-35 ఏళ్ల వయస్సు గల మహిళలు అర్హులన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికేట్‌తో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ సర్టిఫికేట్లు, ఆధార్ జెరాక్స్, రెండు ఫోటోలతో హాజరుకావాలని కోరారు. వివరాలకు హబ్ కోఆర్డినేటర్ ఆర్.సోమేశ్వరరావు, ఫోన్ నెంబరు 6301046329కు సంప్రదించాలన్నారు.

సభ్యుల నియామకం

ఇచ్ఛాపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ రైల్వే యూజర్స్ కమిటీ కన్సల్టెన్సీ సభ్యులుగా పట్టణానికి చెందిన ఐదుగురిని నియమిస్తూ ఖుర్దా డివిజన్ ఈస్ట్‌కోస్ట్ రైల్వే డీఆర్‌ఎం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఉప్పాడ శంకర్ రెడ్డి, బత్తుల తిరుమలరావు, డి.గోపాల్, కె.తిరుపతిరావులను నిమించడం హార్షణీయమని డీఆర్‌యూసీసీ సభ్యుడు కట్టా సూర్యప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు.

లంచం కేసులో పట్టుబడిన వీఆర్వోపై చర్యలు నిలిపివేత

రణస్థలం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కోటపాలెం గ్రామ సచివాలయంలో వీఆర్వోగా పనిచేస్తున్న పొగరు శ్రీనివాసరావుపై ప్రభుత్వం, ప్రాసిక్యూషన్ అనుమతి ఇచ్చినప్పటికీ ఆయన మృతి చెందడంతో తదుపరి చర్యలను ప్రభుత్వం రద్దు చేసింది. రాష్ట్ర రెవెన్యూ (విజిలెన్స్-5) శాఖ జారీచేసిన ఉత్తర్వులు ప్రకారం.. విజయనగరం పూల్‌బాగ్ కాలనీకి చెందిన గొర్లె వరలక్ష్మికి అనుకూలంగా నివేదిక ఇవ్వడానికి రూ.20 వేలు లంచం వీఆర్వో శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో వరలక్ష్మి ఫిర్యాదు మేరకు 2023 ఆగస్టు 10లంచం తీసుకుంటూ శ్రీనివాసరావు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. దీనిపై 2025 జనవరి 24న వీఆర్వోపై అభియోగాలు దాఖలు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే శ్రీనివాసరావు గతేడాది నవంబరు 5న మృతిచెందడంతో తదుపరి చర్యలు నిలిపివేయాలని ఏసీబీ అధికారులు, కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించారు. దీంతో ప్రభుత్వం విచారణ నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆయన వల్ల ప్రభుత్వానికి ఏదైనా ఆర్థిక నష్టం జరిగిందని తేలితే, ఆ నష్టాన్ని ఆయన వారసుల నుంచి వసూలు చేయాలని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జి.జయలక్ష్మి ఆదేశాలు జారీ చేశారు.

పశువులు పట్టివేత

హిరమండలం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది పశువులను హిరమండలంలో స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం బలద సంతలో కొనుగోలు చేసి విజయనగరం జిల్లా అలమండ గ్రామానికి వ్యాన్‌లో తరలిస్తూ పట్టుబడ్డారు. దీంతో జనార్దన్, గణపతిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు. పట్టుకున్న పశువలను గుర్ల గోశాలకు తరలించామన్నారు.

పకడ్బందీగా భూసర్వే

గార రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూముల రీ సర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కె.సైరిగాం, తోనింగి రెవెన్యూ గ్రామాల పరిధిలో రీ సర్వే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఆర్డీవో సాయి ప్రత్యూష మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు పీస వెంకట రమణమూర్తి, తహసీల్దార్ ఎం.చక్రవర్తి తదతరులు పాల్గొన్నారు.